క్లుప్తంగా

కార్పొరేషన్ స్కూళ్లలో 'సుంకర' పాఠశాల ప్రథమం



లాస్యప్రియ తండ్రిని సత్కరిస్తున్న వర్రే శ్రీనివాసరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలక సంస్థ పరిధిలోని సుంకర భాస్కర రావు కార్పొరేషన్ స్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో 90 శాతం ఉత్తీర్ణతతో కార్పొరేషన్ పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వర్రే శ్రీనివాసరావు గురువారం హెచ్‌ఎం రొబ్బి సన్యాసిరావు, ఉపాధ్యాయులను అభినందించారు. పరీక్షల్లో 582 మార్కులు సాధించి స్కూలు టాపర్ వచ్చిన చల్లా లాస్యప్రియకు ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు. విద్యార్థిని తండ్రిని వర్రేతో పాటు, పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ సైకాలజిస్ట్ నాగేంద్రకిషోర్ సత్కరించారు.

టెన్త్ ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ హవా

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాలలో స్థానిక హుకుంపేటలోని డాక్టర్ కేకేఆర్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. కె.లాస్య నాగశ్రీ 595, ఎం.ప్రణీత్ సాయివిష్ణు 594, జె.మౌనిక, వి.తనీష్ 592 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని పాఠశాల డీన్ కిషోర్ తెలిపారు. భవిష్యత్తులో వీరంతా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపాల్ టి.సతీష్‌కుమార్, బి.లీలాధర్ ఆకాంక్షించారు. ఇంతటి విజయానికి కారకులైన విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేకేఆర్, డైరెక్టర్ అవినాష్, వీవీఎస్ ప్రసాద్ అభినందించారు.

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో రవీంద్ర విద్యా నికేతన్ విజయభేరి



ఎ.జోత్స్నమాధురి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పదో తరగతి పరీక్షా ఫలితాలలో రవీంద్ర విద్యానికేతన్ నూరు శాతం విజయం సాధించి విజయభేరి మోగించిందని పాఠశాల చైర్మన్ డీవీ స్వామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు 53 మంది విద్యార్థులు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎ.జోత్స్నమాధురి 583 మార్కులు సాధించిందన్నారు. 28కి పైగా విద్యార్థులు 500 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ డీవీ స్వామిరెడ్డి, డైరెక్టర్ డి.వినీత్‌రెడ్డి అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ గురువారం తెలిపారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మురళీకొండ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలు, మసీదు వీధి, పంచాయతీ వీధి, జీపీఆర్ రోడ్, కొత్తపేట, వేంకటగిరి కొండ, జిల్లా స్టోర్స్, ఎంఆర్టీ ఆఫీస్, బొమ్మూరు సెంటర్ నుంచి రాజవోలు రోడ్, హెచ్‌పీ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకూ రిలయన్స్ స్మార్ట్, బ్రదరన్ చర్చి, నాగరాజా మున్సిపల్ స్కూల్, గిరిజన కార్పొరేషన్, చెరుకూరి ఏరియా, విద్యానగర్, వీవర్స్ కాలనీ, రావి చెట్టు, చర్చి ఆఫ్ గాడ్, గణేష్‌నగర్, పీఅండ్‌టీ కాలనీ, పోస్టాఫీస్ రోడ్, జయకృష్ణపురం, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

ఉగ్రవాదుల దాడిని ఖండించాలి

రాజమహేంద్రవరం రూరల్: దేశాన్ని ప్రేమించే, మానవతా విలువలు కాపాడే ప్రతి ఒక్కరూ ఉగ్రవాదుల దురాగతాన్ని ఖండించాలని సీనియర్ న్యాయవాది ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. పెహల్గాంలో జరిగిన ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో గురువారం బొమ్మూరు గ్రామంలో ఆమె ఆధ్వర్యంలో ఆత్మజ్యోతి ప్రజ్వలనతో దీపర్యాలీ నిర్వహించారు. దోసాలమ్మ అమ్మవారి ఆలయం నుంచి బాలాజీపేట సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: దివాన్‌చెరువు రైసు మిల్లు వీధిలో పట్టపగలు మహిళ మెడలో గొలుసు దొంగిలించిన ఇద్దరిని బొమ్మూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ నెల 10న దివాన్‌చెరువులో నడిచివెళుతున్న మహిళ మెడలో 12 గ్రాముల బంగారు గొలుసును ఇద్దరు బైక్‌పై వచ్చి లాక్కుని పోయారు. మహిళ ఫిర్యాదు మేరకు సీఐ పి.కాశీవిశ్వనాథం కేసు నమోదు చేశారు. గురువారం జీరో పాయింట్ వద్ద ఒడిశాకు చెందిన కోరాడ సూర్యారావు అలియాస్ సూర్యప్రకాష్, ఏఎస్సార్ జిల్లా అరకు గ్రామానికి చెందిన వెన్నెల ఉమాశంకర్ అలియాస్ ఉమను పోలీసులు అరెస్టు చేశారు.

యువతి అదృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగిరాలేదని సీతంపేటకు చెందిన మహిళ గురువారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీతంపేటకు చెందిన 20 ఏళ్ల యువతి బుధవారం ఇంటి నుంచి వెళ్లింది. ఎంతకూ ఆమె తిరిగి రాకపోవడంతో, ఆమె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. త్రీటౌన్ ఎస్సై అప్పలరాజు దర్యాప్తు చేస్తున్నారు.

అసలే ఉక్కపోత.. ఆపై కరెంటు కోత

- ఎండ వేడిమికి అల్లాడుతున్న ప్రజలు
- కరెంట్ కోతలతో చిన్నారులు, వృద్ధుల ఇబ్బందులు
- విచ్చలవిడిగా చెట్ల నరికివేత
- పర్యావరణ అసమతుల్యత ప్రభావమే..



నిర్మానుష్యంగా ఉన్న పేపర్ మిల్లు-సీతానగరం రోడ్డు



కంబాలచెరువు వద్ద వివేకానంద సెంటర్



వెలవెలబోతున్న మెయిన్ రోడ్డు

సీటీఆర్ఐ: మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తయారైంది నగరవాసుల పరిస్థితి. అసలే ఎండాకాలం, ఆపై భానుడి ప్రతాపం. ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చిరు వ్యాపారులు చెట్ల నీడన సేదతీరుతూ, కొనుగోలుదారుడు వచ్చినప్పుడు మాత్రమే విక్రయాలు సాగిస్తున్నారు. ఉష్ణోగ్రత 38 డిగ్రీలు దాటడం, గాలిలో తేమ 60 శాతంకంటే తక్కువకు దిగజారడంతో ప్రజలు ఉక్కబోతను భరించలేకపోతున్నారు. రాత్రివేళల్లోనూ ఉష్ణోగ్రతలు కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. పగలు ఇంట్లో వస్తువులు వేడెక్కిపోతున్నాయి.

కోతతో ఇబ్బందులు

నగరంలో కరెంట్ కోతతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రాత్రి స్థానిక మల్లికార్జుననగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో రాత్రంతా కరెంట్ లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అసలే ఉక్కబోతతో అల్లాడుతున్న ప్రజలకు.. కూటమి ప్రభుత్వం బోనస్‌గా కరెంట్ కోతలతో వేధిస్తుండడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. నిత్యం నగరంలో కొన్ని ప్రాంతాలలో కరెంట్ కోతలు విధిస్తున్నారు. వర్షం రాకపోయినా, కనీసం ఈదురు గాలులు లేకపోయినా ఎందుకు కరెంట్ కోత పెడుతున్నారో తెలియక విద్యుత్ అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

చెట్ల నరికివేతతో..

నగరమంతా ఒకప్పుడు పచ్చని చెట్లతో కళకళలాడుతుండేది. నగర అభివృద్ధి అంటూ, విద్యుత్ తీగలకు కొమ్మలు తగులుతున్నాయంటూ ఆయా ప్రభుత్వ శాఖల సిబ్బంది చెట్లను యథేచ్ఛగా నరికివేయడం.. రాజమండ్రిలో ఎండ తీవ్రత పెరగడానికి ప్రధాన కారణమని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. కాగా మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని రోడ్లపై జన సంచారం కానరావడం లేదు. ముఖ్యమైన పని ఉంటే తప్ప మధ్యాహ్నం వేళల్లో ఎవరూ రోడ్లపైకి రావడం లేదు. దీంతో నగరంలో రోడ్లన్నీ దాదాపు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం చీకటిపడ్డాక కానీ రోడ్లపైకి జనం రావడం లేదు.

పెరుగుతున్న భూ తాపం!



మానవుని తప్పిదాలతో గణనీయంగా ఉత్పత్తి అవుతున్న హరిత గృహ వాయువుల వల్ల భూమి ఉష్ణోగ్రత పెరుగుతోంది. తద్వారా రాను రాను ఎండ తీవ్రత మరింత ఎక్కువ అవుతోంది. అడవులను విచ్చలవిడిగా నరికివేయడం, నగరీకరణ, పట్టణీకరణతో చెట్లను నరికివేసి కాంక్రీట్ జంగిల్స్‌గా మార్చడం వంటి కారణాలు కూడా ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణం. ఎక్కువగా కాంక్రీట్ భవనాలు, రహదారులు ఉండటం వల్ల వేడెక్కిన భూమి త్వరితంగా చల్లారే పరిస్థితులు ఉండడం లేదు. పచ్చదనం తగ్గిపోవడంతో ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, సహజ సిద్ధంగా ఆక్సిజన్ విడుదల కూడా తగ్గిపోతోంది. ఇది ఆరోగ్యంపై, పర్యావరణంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతోంది.

– బి.మల్లేశ్వరరావు, బోటనీ లెక్చరర్, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

భవిష్యత్తులో ఉష్ణోగ్రతలు తీవ్రం



ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం లేకపోలేదు. అధిక జనాభా కేంద్రీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వల్ల ప్రకృతి వనరుల వినియోగం అధికమవుతుంది, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. వాహనాల నుంచి వెలువడే పొగ వాతావరణ కాలుష్యానికి కారణమవుతోంది. ఇవన్నీ వాతావరణ మార్పులకు దారి తీస్తున్నాయి. అందువల్లే ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.

– ఎం.కాశీవిశ్వనాథ్, జువాలజీ లెక్చరర్, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కరెంట్ కోతతో నరకయాతన



చీటికీమాటికీ కరెంట్ తీసేస్తుండడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. చిన్నపాటి గాలికే కరెంట్ కోత, ఆకాశం మేఘావృతమైతే కరెంట్ కోత. దానికితోడు నగరంలో ఎక్కడో ఓచోట ట్రాన్స్‌ఫార్మర్ పేలితే.. ఆ ప్రాంతంలో ప్రత్యక్ష నరకం చూసినట్టే. 41, 42, 43, 44 డివిజన్లలో కొద్ది రోజులుగా గంటగంటకూ కరెంట్ కోతలు విధిస్తున్నారు. ఎందుకో అర్థం కావడం లేదు.

– తాడేపల్లి విజయ్‌కుమార్, అడ్వకేట్

భరత్ చేసిన అభివృద్ధి ఎమ్మెల్యే ఖాతాలోకి..

వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం నేత మజ్జి అప్పారావు విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీగా మార్గాని భరత్ రామ్ నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే.. వాటిని ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తన ఖాతాలో వేసుకున్నారని, ఇలాంటి చర్యలను మానుకోవాలని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు మజ్జి అప్పారావు హితవు పలికారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎంపీ భరత్‌రామ్‌ను విమర్శించే స్థాయి, ఒకే ఒక్క నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు లేదని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం నగరం అభివృద్ధి చెందిందంటే అందుకు భరత్‌రామ్ చేసిన కృషి మాత్రమేనన్నారు. రూ.125 కోట్ల నిధులను మంజూరు చేయించి, దశలవారీగా అభివృద్ధి పనులు చేశారన్నారు. రోడ్డు డివైడర్ల మధ్యన గ్రీనరీ, క్వారీ మార్కెట్ వద్ద అంబేడ్కర్ విగ్రహం, వై.జంక్షన్ నుంచి లాలా చెరువు వరకు రోడ్డు సుందరీకరణ, ఈట్ స్ట్రీట్, హ్యాపీ స్ట్రీట్, విద్యార్థుల కోసం పూలే-అంబేడ్కర్ భవన నిర్మాణంతో పాటు, మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి తదితర అభివృద్ధి పనులు చేశారన్నారు. యాదవులకు, రజకులకు, పద్మశాలీలకు కమ్యూనిటీ భవనాలకు స్థలాలు కేటాయించారన్నారు. గోదావరి బండ్ అభివృద్ధికి రూ.22 కోట్లతో శంకుస్థాపన చేస్తే.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తామే సాధించామని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. పార్లమెంట్‌లో చీఫ్ విప్‌గా వ్యవహరించిన భరత్‌రామ్‌ను విమర్శించే అర్హత ఎమ్మెల్యే వాసుకు లేదన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని, గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని హితవు పలికారు. యూత్ వింగ్ అధ్యక్షుడు బిల్డర్ చిన్న మాట్లాడుతూ, మాజీ ఎంపీ భరత్‌రామ్ ఐదు సార్లు ప్రభుత్వాస్పత్రిని సందర్శించారని ఎమ్మెల్యే వాసు విమర్శిస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని ఐదేళ్లలో ఎన్నిసార్లు ప్రభుత్వాస్పత్రిని సందర్శించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే చుట్టూ ఉన్న నాయకులు ఇసుక, మద్యం మాఫియా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే భజనపరులని ధ్వజమెత్తారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాటం రజనీకాంత్, వీవర్స్ విభాగం అధ్యక్షులు నందం స్వామి, సిటీ ఎస్సీ సెల్ చైర్మన్ నాయకులు తిరగటి దుర్గ, బూత్ కమిటీ అధ్యక్షులు గణేష్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు రేగుళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్యాస్ డెలివరీ వర్కర్లు

- ఎల్‌పీజీ గ్యాస్ డెలివరీ కార్మికుల డిమాండ్
- కలెక్టరేట్, లేబర్ ఆఫీసు వద్ద ధర్నా

సీటీఆర్ఐ: తమ డిమాండ్ల సాధన కోసం రాజమహేంద్రవరంలో గురువారం ఎల్‌పీజీ గ్యాస్ డెలివరీ కార్మికులు ప్రదర్శన, ధర్నా చేపట్టారు. స్థానిక కోటిలింగాలపేట నుంచి బొమ్మూరు కలెక్టరేట్ వరకు మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి, డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. డిస్ట్రిబ్యూటర్లకు, కార్మికులకు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని డీఆర్వో సీతారామమూర్తి హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు స్థానిక ఏవీ అప్పారావు రోడ్‌లోని లేబర్ ఆఫీసుకు మోటార్ బైక్‌లపై ర్యాలీగా చేరుకుని, ధర్నా నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వలికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సిలిండర్‌కు రూ.150 కమీషన్ పెంచాలని డిస్ట్రిబ్యూటర్లు డిమాండ్ చేస్తున్నారని, మరి కార్మికులకు వేతనాలు ఎందుకు పెంచడంలేదని ప్రశ్నించారు. జిల్లాలో చాలామంది డిస్ట్రిబ్యూటర్లు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మండిపడ్డారు. కష్టమర్ల దయాదాక్షిణ్యాలపై కార్మికుల బతకాల్సిన దుస్థితి నెలకొందని, కార్మికులకు యజమానులు చేసింది శూన్యమని విమర్శించారు. ఒప్పంద కాలం గతేడాది డిసెంబర్ 31తో ముగిసినప్పటికీ, యజమానులు కార్మికులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులను తక్షణం చర్చలకు పిలిచి, సామరస్యపూర్వకంగా ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ శివశరణ్, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ సెకండ్ సాధించిన హర్షిత్‌కు అభినందనలు



హర్షిత్‌ను అభినందిస్తున్న డీఈఓ వాసుదేవరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో 599/600 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానాన్ని పొందిన బొమ్మూరు భాష్యం స్కూల్ విద్యార్థి కె.హర్షిత్‌ను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అభినందించారు. విద్యార్థికి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యను అందించడంలో భాష్యం విద్యా సంస్థలు ముందుంటాయన్నారు. పిల్లల చదువుతో పాటు, క్రమశిక్షణ కూడా ఉంటే విజయాలను సాధించగలుగుతారని తెలిపారు. విద్యార్థితో పాటు, వారి తల్లిదండ్రులను, ఈస్ట్-2 జోనల్ ఆంజనేయులు, హెచ్‌ఎం దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

పేపరుమిల్లు చేయూత

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో తరగతి గదులు నిర్మాణానికి ది ఆంధ్రా పేపరుమిల్లు యాజమాన్యం సీఎస్సార్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసింది. దీంతో రెండు తరగతి గదులు వేగవంతంగా నిర్మాణమవుతున్నాయి. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ డా.ఏఎం జయశ్రీ మాట్లాడుతూ, తరగతి గదులు నిర్మాణానికి రూ.70 లక్షలు ప్రతిపాదనలు పంపించగా, ది ఆంధ్రా పేపరు మిల్లు ప్రస్తుతం సీఎస్సార్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు. పేపరుమిల్లు యాజమాన్య సెక్రటరీ బి.జయకుమార్, డైరెక్టర్ ముఖేష్ జైన్, పేపరుమిల్లు సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సీఎస్సార్ నిధులు రావడానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తరగతి గదుల నిర్మాణం కోసం సీఎస్సార్ నిధులు రాబట్టడం కోసం కృషి చేసిన లెక్చరర్ గంగాధర్‌ను అభినందించారు.

మోసం చేశాడని యువతి ఫిర్యాదు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి విజయనగరానికి చెందిన ఎస్.రాంబాబు తనను మోసం చేశాడని దేవరపల్లి ప్రాంతానికి చెందిన యువతి గురువారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడేళ్ల నుంచి రాంబాబుతో పాటు, యువతి దేవీచౌక్‌లో పోటీ పరీక్షల కోచింగ్ తీసుకుంటున్నారు. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. పెళ్లి చేసుకోమని అడిగితే ఆమెను కులం పేరుతో దూషించి, వంచించినట్టు యువతి ఫిర్యాదులో పేర్కొంది. త్రీటౌన్ ఎస్సై సుభానీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెంచిన పన్నులను వెంటనే తగ్గించాలి

డీసీసీ అధ్యక్షుడు టీకే



పార్టీ శ్రేణులతో కలసి నిరసన తెలుపుతున్న టీకే

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం 15 శాతం మేరకు పెంచిన ఇంటి, ఆస్తి పన్నులను తగ్గించే వరకు కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. సంపద సృష్టిస్తానని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ప్రజలపై పెనుభారం మోపుతున్నారని విమర్శించారు. ఎన్నడూ లేనివిధంగా ఇంటి పన్ను 15 శాతం పెంచడం దారుణమని ధ్వజమెత్తారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద థాలీ బజావో పేరుతో కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే ఇంటిపన్నులు 15 శాతం పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంటి పన్ను 15 శాతం పెంచితే సొంత ఇళ్లను వదిలిపెట్టి పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. కరెంటు బిల్లులు అత్యధికంగా వస్తున్నా, ప్రజలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. స్థలాల మార్కెట్ విలువను కూడా సబ్ రిజిస్ట్రార్ విలువ కంటే పెంచి కూటమి ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఏడాదికి 5 శాతం మాత్రమే ఇంటి, ఆస్తి పన్ను వసూలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో అవినీతిపరులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. పెంచిన పన్నులను తగ్గించకపోతే ప్రజలు అధికారం నుంచి దించుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్టిన్‌లూథర్, డాక్టర్ వడయార్, మోతా శారద, అబ్దుల్లా షరీఫ్, బెజవాడ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ స్కూళ్లలో కొంతమూరు ఈఏఆర్ ప్రథమం



బాలశ్రీకి నగదు ఇచ్చి, సత్కరించిన ఎంఈవో తులసీదాస్, కరస్పాండెంట్ ప్రభాకరరావు

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలో ఎయిడెడ్ స్కూళ్లలో కొంతమూరు ఈఏఆర్ ఎయిడెడ్ హైస్కూల్ 93 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించింది. స్కూలు విద్యార్థిని కేజే బాలశ్రీ 584 మార్కులతో జిల్లాలో ఎయిడెడ్ స్కూళ్లలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా గురువారం స్కూలు ఆవరణలో విద్యార్థిని బాలశ్రీకి ఉపాధ్యాయిని పీతల స్వర్ణకుమారి రూ.10 వేలను రాజమండ్రి రూరల్ ఎంఈవో తులసీదాస్, స్కూల్ కరస్పాండెంట్ కోలమూరు ప్రభాకరరావు చేతులమీదుగా అందజేశారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.షాలిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీకి రాష్ట్ర స్థాయి అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమండ్రి ప్రభుత్వ కళాశాల(అటానమస్)కు ఐపి, సంగీతం-ఫీల్ ది బీట్ ఆఫ్ ఏపీ విభాగం ప్రతిష్టాత్మకమైన ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాల(అటానమస్)లోని ప్రతిభావంతులైన విద్యార్థులు స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద రూపొందించిన అత్యుత్తమ కళాశాల ఆడియో-విజువల్(ఏవీ) ప్రదర్శనకు గుర్తింపుగా ఈ అవార్డును సాధించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహనరావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గంగాధర్ నుంచి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ఈ అవార్డు అందుకున్నారు.

'ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్' 75 వసంతాల పండగ

నేడు బొమ్మూరులో ప్లాటినం జూబ్లీ వేడుకలు



బొమ్మూరు 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ప్రారంభోత్సవానికి సిద్ధమైన సంఘ చిహ్నం

రాజమహేంద్రవరం రూరల్: ఏడుగురితో 1950 ఏప్రిల్ 12వ తేదీన ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(రి.నం.1104) ఇప్పుడు వేలాది మంది సభ్యులతో 75 వసంతాలు పూర్తి చేసుకుంది. ప్రభుత్వాలు మారినా, పరిస్థితులు మారినా, ఏ ప్రభావం కూడా యూనియన్‌పై పడకుండా, కార్మికుల కోసం, వారితో నడపబడుతున్న ఏకైక యూనియన్. ప్లాటినం జూబ్లీ వేడుకలు ఓఅండ్‌ఎం సర్కిల్ ట్రాన్స్‌కో రాజమహేంద్రవరం ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో బొమ్మూరులో 220 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నూతన జెండా ఆవిష్కరణ, యూనియన్ చిహ్నమైన టవర్ ప్రారంభిస్తారని ప్రాంతీయ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పినిపే సురేష్‌బాబు, జగతా అచ్యుతరామయ్య తెలిపారు. జెండాను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సానా కృష్ణయ్య, టవర్ చిహ్నాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంపీ గోపాలరావు ప్రారంభిస్తారని చెప్పారు. ఓఅండ్‌ఎం సర్కిల్ ఎంప్లాయిస్, టీఎల్‌సీ ఎంప్లాయిస్, రిటైర్డ్ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు.